ఆలయ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నానగర్‌లోని పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు ఈనెల 29 గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి శంకుస్థాపన చేస్తారని పోచారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట, ఫిబ్రవరి 28: మూడుచింతలపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ హారిక కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మూడు చింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

మేడ్చల్, ఫిబ్రవరి 28: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేశామని సీజీఎం సాయిబాబా తెలిపారు. మేడ్చల్ సబ్ డివిజన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో బుధవారం 11కేవీ ఫీడర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీరామ్ మోహన్, డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్/కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో అన్నికాలనీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్‌లో రూ. ఒక కోటి డెబ్బై ఆరు లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధిపనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. నెహ్రూనగర్‌లో కాలనీ బ్లాక్ 1,2,3లో రూ.120లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులు, అశోక్‌నగర్‌లో రూ.9.80లక్షలతో చేపట్టే భూగర్భడ్రైనేజీ పనులు, గోకుల్‌నగర్‌లో రూ.46.50లక్షలతో చేపట్టే కమ్యూనిటీహాలు నిర్మాణం పనులు ఇందులో ఉన్నాయి. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, జీహెచ్ఎంసీ కాప్రాసర్కిల్ డీఈఈ రూపా, ఏఈ శ్రవంతి, స్థానికులు పాల్గొన్నారు

ఇంటర్ పరీక్షలు షురూ..

మేడ్చల్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

అల్వాల్‌లోని పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్‌ను బోర్డుపై పరిశీలిస్తున్న విద్యార్థులు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 68,791 మంది విద్యార్థులకు 67,198 మంది పరీక్షలు రాశారని, 1593 మంది హాజరుకాలేదని ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఓ) కిషన్ తెలిపా రు. మాస్ కాపీంగ్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

మేడ్చల్ : మేడ్చల్ మండలంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు నిర్వహించగా 6 పరీక్ష కేంద్రాల్లో 1974 మంది విద్యార్థులు హాజ రు కావాల్సి ఉండగా 71మంది పరీక్షలకు గై హాజరు అయ్యారని అధికారులు తెలిపారు.

మల్కాజిగిరి : మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి.

క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత

మేడ్చల్, ఫిబ్రవరి 28: క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని శ్రీమేరు హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ నరేశ్, నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్కృష్ట్ పేరుతో రెండు రోజుల క్రీడోత్సాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ క్రీడోత్సవంలో 40 కళాశాలల నుంచి 90 జట్టు పాల్గొన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, కరస్పాండెంట్ సంగీతరెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డీన్ రామదాసు, సాక్ కన్వీనర్ శైలజారెడ్డి, పీడీ జెస్సీ రోనాల్డ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మేడ్చల్, ఫిబ్రవరి 28: యువత రక్తదానానికి ముందుకు రావాలని గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మ గూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతో పాటు దంత, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సరోజరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీలత, పీఆర్వో రవి, సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కీసర, ఫిబ్రవరి 28: చీర్యాల్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ మంత్రిబాబుమోహన్, జడ్పీ వైస్ వెంకటేష్, ఎంపీపీ ఇందిరలక్ష్మీనారాయణతో పాటు భక్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులను ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ఎంపీపీ ఇందిర సత్కరించారు. అనంతరం వేదపండితుల చేత ఆశీర్వచనం చేశారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 28: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో అల్వాల్ కానాజీగూడకు చెందిన విజయకుమారికి ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స కోసం మంజూరైన రూ.1.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చర్లపల్లి, ఫిబ్రవరి 28: అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందిన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చర్లపల్లి డివిజన్ మహాలక్ష్మినగర్ రైల్వేస్టేషన్ బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(30) తీవ్ర గాయాలై పడి ఉండటంతో వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చెరుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన వ్యక్తిని మెరుగైన చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా మర్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాగారం 5వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ప్రతి కాలనీలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో సిమెంట్ రోడ్డు పనులకు చైర్మన్ శంకుస్థాపలన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, కౌన్సిలర్ లావణ్య, నాయకులు శ్రీనివాస్, కాల నీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్

అంతర్ రాష్ట్ర బదిలీలు చేపట్టాలి

మేడ్చల్ కలెక్టరేట్,ఫిబ్రవరి 28: అంతరాష్ట్ర బదిలీల్లో భాగంగా మిగిలిపోయిన జిల్లా,జోనల్,మల్టీజోనల్ స్థాయిలో ఆంధ్రలో పని చేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను తెలంగాణకు మానవతా దృక్పథంతో రప్పించాలని ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి జిల్లా స్థాయి, జోనల్ స్థాయి, మల్టీ జోనల్ స్థాయి తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను రప్పించాడానికి ప్రయత్నిస్తామని ప్రభుత్వ సలహాదారు తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, రమేశ్, సూర్య, సుగుణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభు త్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని అల్వాల్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం అల్వాల్ సర్కిల్ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడుగా మధుసూదన్ రెడ్డి(ఆంధ్రప్రభ), గౌరవ సలహాదారుడు అస శ్రీరాములు(సవభూమి), అధ్యక్షుడుగా ఎం రాములు(సాక్షి), ఉపాధ్యక్షులుగా ఎం నరేందర్ రెడ్డి(ఆంధ్ర జ్యోతి), వర్మ(వార్త), ప్రధాన కార్యదర్శిగా మల్లేష్(దిశ), కోశాధికారిగా బీ చంద్రశేఖర్(ప్రజా దర్బార్), సంయుక్త కార్యదర్శిగా కే శివకుమార్(నినాదం), కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్(జనంసాక్షి), దీపక్(నవ తెలంగాణ), నర్సింహ(ఫోట గ్రాఫర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.23కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: దమ్మాయిగూడ మున్సిపాలిటీ 2024-2025 అంచనా బడ్జెట్ రూ. 23 కోట్ల 35 లక్షల 2వేలను మున్సిపల్ పాలకవర్గ ఆమోదించింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు.పన్నుల ద్వారా రూ.8 కోట్ల 20 లక్షలు, ఇంటి నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్స్ ఫీజులు ద్వారా రూ. 13 కోట్ల72 లక్షలు, పట్టణ ప్రగతి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 90 లక్షలు నిధులు వస్తాయని చైర్‌పర్సన్ తెలిపారు. హరితహారానికి రూ.2 కోట్ల 25 లక్షలు, వేతనాలకు రూ. 4 కోట్ల 85 లక్షలు, అభివృద్ధి పనులకు 2 కోట్ల 8 లక్షలు, బలహీన వర్గాల కాలనీల అభివృద్ధికి రూ. 6 కోట్ల 9 లక్షలు ఇంజినీరింగ్ నిర్వహణకు రూ.4 కోట్ల 23 లక్షలు పట్టణ ప్రగతి పనులకు రూ.2 కోట్ల 54 లక్షలు, మొత్తం రూ. 22 కోట్ల 76 లక్షలు కేటాయిస్తు వార్షిక అంచనా వ్యయం బడ్జెట్ రూపొందించినట్లు ప్రణీత చెప్పారు.

అదనపు భవనం ప్రారంభం

మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన అదనపు భవనాన్ని చైర్‌పర్సన్ ప్రణీత ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ ఎస్. రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు నానునాయక్, సుజాత, హేమలత, సురేఖ,వెంకటేశ్, పావనిరెడ్డి, స్వప్న, సరిత, శ్రీలత,వెంకటరమణ,అనురాధ,రమేశ్‌గౌడ్, నరసింహారెడ్డి, శ్రీహరిగౌడ్, కో-ఆప్షన్ సభ్యులు రజిని, అధికారులు ప్రభు, వార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

జవహర్‌నగర్, ఫిబ్రవరి 28:జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్‌కు చెందిన దివ్యాంగురాలు భాగ్యలక్ష్మి కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న తెలంగాణ దివ్యాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ శంకర ఫౌండేషన్ సంస్థ సహకారంతో ఉపాధి నిమిత్తం కిరాణ దుకాణాన్ని బుధవారం పెట్టించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా గౌ రవ అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రశాంత్, శ్రీధర్, రజిత, శృతి, మల్లిక, రుక్మిణి పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ సభ్యులు ఐక్యంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని కలిసిన 'హౌసింగ్ సొసైటీ' నూతన కమిటీ

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 28: నేరేడ్‌మెట్ డివిజన్ జేజేనగర్ ముత్యాలరావు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరూ బుధవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులందరికి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ ఐకమత్యంతో ఉంటూ ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డీఎల్ఎన్. రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వేలు, సెక్రటరి కె.ఉమేష్, కోశాధికారి కృష్ణదేవి, కమిటీ మెంబర్లు అలపూల, కొండల్‌రావు, రాము, వెంకటేశ్, జయశ్రీ, రాధ, బాలకృష్ణ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

అనుమతులు ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: అనుమతులు ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలని, అనుమతులు లేని నిర్మాణాలు కూల్చివేయడంతో పాటు యజమానులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజేందర్ కుమార్ హెచ్చరించారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అనుమతులు లేకుండా నిర్మించిన నాలుగు అక్రమ షెడ్లు, నిర్మించిన అదనపు అంతస్తుల భవన నిర్మాణాలను బుధవారం కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కావ్య, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రామంతాపూర్,ఫిబ్రవరి 28: ఉప్పల్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ మందమూల రజితా పరమేశ్వర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్ రెడ్డి,కాలనీ అధ్యక్షులు సతీశ్‌గౌడ్, నాయకులు పండు, జగన్, శ్రీధర్, విజయభాస్కర్, కుమార్‌స్వామి, సల్లప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్, రాఘవేందర్, సోమయ్య, చందు, మధుసూదన్‌రెడ్డి, పీరయ్య, రాజు, పద్మ, జ్యోతి, లావణ్య, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్

కాప్రా, ఫిబ్రవరి 28: కాప్రా డివిజన్ మహ్మదీయకాలనీలో సర్వేనంబర్ 510/1లో ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ కాప్రామండలం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఫెన్సింగ్ పనులు చేపట్టారు. ఈ కాలనీలో ఉన్న సుమారు 20 గుంటల ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ చేపడ్తామని ప్రకటించిన కొద్దిరోజుల్లోనే అందుకు సంబంధించిన కార్యాచరణ మొదలు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనాలు, ఎగ్జిబిట్స్‌లను తిలకిస్తున్న ఎంఈవో వసంతకుమారి, ఉపాధ్యాయులు

రామంతాపూర్,ఫిబ్రవరి 28: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ ,పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునీత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ,అకాడమిక్ కోర్డినేటర్ జి. గీత,కన్వీనర్ డాక్టర్ . శ్రీనివాసరావు,ఆర్ చంద్రసాగర్,తిరుపతయ్య, మంజుల, విశ్వనాథ్‌కుమార్,జి. మురళీకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ స్కూల్‌లో ..

జాతీయ వైజ్ఞానిక దినోత్సవం పురస్కరించుకొని రామంతాపూర్‌లోని కాకతీయ స్కూల్లో బుధవారం వైజ్ఞానిక దినోత్సవాన్ని నిర్వహించారు. అబ్దుల్ కలామ్‌తోపాటు పలువురు శాస్త్ర వేత్తల చిత్రపటాలకు పాఠశాల డైరెక్టర్ వైభవి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీం ద్ర, విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

నాగారం ప్రభుత్వ పాఠశాలలో..

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 :విద్యార్థులు నూతన ఆవిష్కరణలను తయారు చేయాలని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు.నాగారం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నూతన ఆవిష్కరణలకు చంద్రారెడ్డి తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్ రేణుక, ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు ప్రమీల, వనజారాంరెడ్డి, ముంతాజ్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

తూంకుంటలో..

శామీర్‌పేట, ఫిబ్రవరి 28: విద్యార్థులు మంచి ఉత్తీర్ణతను సాధించాలని ఎంఈవో వసంతకుమారి సూచించారు. తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం సైన్స్ మేళా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ నమూనాలు, ఎగ్జిబిట్స్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, తిరుమలేశ, మేరీ, నాగ శారద, వనజ, శ్రీదేవి, శైలజ, మంజుల, రజినీ, అమీనాభి పాల్గొన్నారు.

రామంతాపూర్ జడ్పీ హైస్కూల్లో..

రామంతాపూర్,ఫిబ్రవరి 28: రామంతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను ఆమె తిలకించారు. అనంతరం డ్రాయింగ్,క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జె.లలిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పూడూర్‌లో..

మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 28: మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని సెహగల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు రాజబొల్లారం, రావల్‌కోల్, మేడ్చల్, శ్రీరంగవరం, నూతన్‌కల్, యాడారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో వసంత బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన్స్ కళాశాలలో ..

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 28: భవన్స్ కళాశాల ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అండ్ హెచ్ఓసీ, ఎన్ఐసీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్. కె. రాజశేఖర్, డైరెక్టర్ సీపీఎంబి, ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ డాక్టర్. రామకృష్ణ కంచె పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.జీఎస్‌వీఆర్‌కే. చౌందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడుప్పల్ ఉన్నత పాఠశాలలో..

బోడుప్పల్: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా బుధవారం బోడుప్పల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టి వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్, ఈసీనగర్‌లో..

చర్లపల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్లపల్లి డివిజన్, ఈసీనగర్‌లోని కృప విజ్ఞాన్ సైంటిఫిక్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో 35సైంటిఫిక్ ప్రయోగాలు, పర్యావరణ హితం అంశాలపై ప్రదర్శన ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించి శాస్త్రవేత్తల ఫొటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రచయిత పీబీ. చారి రచించిన విశ్వం జీవం మానవుడు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు గొడుగు యాదగిరి, జయప్రకాశ్, శివప్రసాద్, ప్రిన్సిపాల్ కృప, ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ సైంటిస్ట్ సతీష్, ప్రిన్సిపాల్ దయాకర్‌రావు, అకాడమిక్ కో ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, డీన్ మధుకర్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి వెంకన్న ఆవిష్కరణలను పరిశీలించివిద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యాలు..

కల్యాణి(ఫైల్)

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 28: యువతి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నేరేడ్‌మెట్ ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం...రాంబ్రహ్మనగర్‌లో నివాసం ఉంటున్న నర్సింహ, కల్యాణి (22) భార్యాభర్తలు. ఈనె ల 26న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈనెల 27న భర్త ఇంట్లో పడుకున్న సమయంలో ఇంటి తలుపులకు తాళం వేసి బయటికి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి..

మమత(ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 28: భర్తతో గొడవపడి భార్య అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం... శ్రీరామ్‌నగర్ కాలనీలో మమత, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటుంది. భార్యభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 28న ఇంట్లో చెప్పకుండా తన ఇద్దరు పిల్లలు శృతి(11), విజయ(9), ఆడపడుచు కూతురు సంకీర్తన(9)తో సహా కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలే దు.

సూర్యనగర్‌లో యువకుడు..

శివరామకుమార్ (ఫైల్)

మల్కాజిగిరి, ఫిబ్రవరి 28: యువకుడు అదృశ్యమైన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యనగర్‌కు చెందిన శివరామకుమార్ (44) ఉద్యోగం కోసం సోమవారం జహీరాబాద్‌కు ట్రైనింగ్‌కు వెళ్లడానికి కారును బుక్ చేసుకుని వెళ్లి రాలేదు. ఈ మేర కు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.